తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 231
మంగళవారం 27, జనవరి 2026
॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## ఆంధ్రజ్యోతి వర్సెస్ బీఆర్ఎస్

- మళ్లీ మొదటికి వచ్చిన పాత శత్రుత్వం
- తమ పార్టీ కార్యాలయాల్లోకి ఆంధ్రజ్యోతి,
- ఏబీఎన్ ప్రతినిధులు రావద్దన్న గులాబీ పార్టీ
- ఏబీఎన్ డిబేట్లకు బీఆర్ఎస్ ప్రతినిధులు రారని ప్రకటన
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనూ ఇదే పరిస్థితి
- కేసీఆర్, ఆంధ్రజ్యోతి ఎండీ ద రాధాకృష్ణ మధ్య వైరం
- ఫోన్ ట్యాపింగ్ కేసుపై వార్తలతో పరాకాష్ఠకు

6లో





## స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత
- గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో పిసిసి చీఫ్

2లో



## దేశ భద్రతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

- సురక్షిత నగరంగా నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి
- గణతంత్ర వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

2లో





# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు
- ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్

**న్యూఢిల్లీ,జనవరి26(అక్షర గళం):** దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన మిగతా.. 2లో

## ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా

- ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ
- పరేడ్ వివరాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ కనిపించిన ప్రధాని

**న్యూఢిల్లీ,జనవరి26(అక్షర గళం):** దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు



ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. అయితే మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. ఉర్సులాకు ప్రధాని మోడీ పరేడు వివరాలను ఎప్పటికప్పుడు వివరించారు. మోడీ వివరాలను ఆమె ఆసక్తిగా విన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా మిగతా.. 2లో



## అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు

- శుభాంశు శుక్లాకు అశోకచక్ర ప్రదానం

**న్యూఢిల్లీ,జనవరి26(అక్షర గళం):** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్‌శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సియమ్-4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్‌లో 'యాక్సియమ్-4' మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన మిగతా.. 2లో

## తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో
# పెరిగిన ఇమేజ్




- మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన
- సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు
- 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ
- ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత
- గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్,జనవరి26 (అక్షర గళం):** భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. మిగతా.. 2లో

## భారత్ నూలుపై సుంకాలు విధించాల్సిందే

- బంగ్లా వస్త్రవ్యాపారుల డిమాండ్

**ఢాకా,(అక్షర గళం):** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి భారత్-బంగ్లాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. మరోవైపు ఆ దేశంలోని హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి వస్త్ర పరిశ్రమ వర్గాలు మరో డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చాయి. ఇప్పటి వరకు భారత నూలుకు బంగ్లాదేశ్‌లో ఉన్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యం తొలగించాలని పట్టుబట్టాయి. లేదంటే ఫిబ్రవరి 1 నుంచి కర్మాగారాలు



మిగతా.. 2లో

## మేడారాన్ని సందర్శించిన మావోరి తెగ ప్రతినిధులు

### గద్దెల ప్రాంగణంలో హాకా నృత్య ప్రదర్శన
### కళాకారులతో కలిసి నృత్యం చేసిన మంత్రి సీతక్క



**ములుగు,జనవరి26(అక్షర గళం):** ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క-సారలమ్మ మహా జాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం గద్దెల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన 'హాకా' నృత్యాన్ని వారు ప్రదర్శించారు. హాకా నృత్యం అనేది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ఈ నృత్యంలో ముఖభావాలు, శరీర చలనలు అత్యంత ప్రభావవంతంగా ఉంటాయి. తెలంగాణ న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను మిగతా.. 2లో



## కర్రెగుట్టల్లో పేలిన మందుపాతరలు

- పదిమంది భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు

**ములుగు,జనవరి26(అక్షర గళం):** తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలు పేలి 10 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలిక, ఐఈడీలు అమర్చినట్లు భద్రతా సంస్థలకు విశ్వసనీయ సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అనేక ఐఈడీలు ఒకదాని తర్వాత ఒకటి పేలాయి. దీంతో జవాన్లు గాయపడ్డారు. వారిని ఆర్మీ హెలికాప్టర్‌లో రాయ్‌పుర్‌కు తరలించారు. వీరిలో 9 మంది డీఆర్‌జీ, మరొకరు కోబ్రా బెటాలియన్‌కు చెందిన వారు. గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కర్రెగుట్టల్లో హై అలర్ట్ ప్రకటించి కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గతేడాది ఇదే ప్రాంతంలో 21 రోజుల పాటు దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర



### అదేబాటలో కాంగ్రెస్ పాలకులు ◆ బిజెపి కార్యాలయంలో జెండా ఎగరేసిన రామచందర్ రావు

**హైదరాబాద్,జనవరి26(అక్షర గళం):** రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ మిగతా.. 2లో

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత్ర

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి
- బిఆర్ఎస్‌లో చేరిన పలువురు చేవెళ్ల నేతలు
- కార్యకర్తలకు కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,జనవరి26(అక్షర గళం):** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత్ర పోషిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మిగతా.. 2లో



తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

**హైదరాబాద్,జనవరి26(అక్షర గళం):** స్వాతంత్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్



గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు-మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు.



బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**ముర్ము, మోడీల సందేశం**

**న్యూఢిల్లీ,జనవరి26(అక్షర గళం):** భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో దేశ ప్రజలకు సందేశమిచ్చారు. 'మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ జీవితం.. ఆనందం, శాంతి, భద్రత, సామరస్యంతో నిండి ఉంటుందని నేను గట్టిగా నమ్ముతున్నాను' అని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఒక సందేశం పోస్ట్ చేశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా వికసిత్ భారత్‌ను నిర్మించాలనే మన సమష్టి సంకల్పంలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని అందించాలని ఆకాంక్షించారు మోదీ. గణతంత్ర దినోత్సవం మన స్వేచ్ఛ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు శక్తిమంతమైన చిహ్నమని ప్రధాని తెలిపారు. ఈ పండుగ దేశాన్ని కలిసి నిర్మించాలనే సంకల్పంతో ముందుకు సాగడానికి మనకు కొత్త శక్తిని, ప్రేరణను ఇస్తుందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మన దేశవాసులందరికీ అనేకానేక శుభాకాంక్షలు. భారతదేశ గర్వం, కీర్తికి ప్రతీక అయిన ఈ జాతీయ పండుగ.. మీ అందరి జీవితాల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపాలి. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం సంకల్పం మరింత బలపడాలి' అని ఎక్స్ వేదికగా ప్రధాని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని మోదీ అన్నారు.

## దేశ భద్రతకు ప్రతి ఒక్కరూ
# పునరంకితం కావాలి

**హైదరాబాద్,జనవరి26(అక్షర గళం):** దేశ భద్రత కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను దేశంలోనే కాదు.. అంతర్జాతీయ స్థాయిలో సురక్షిత నగరంగా నిలబెట్టడానికి పోలీసు శాఖ కృషి చేస్తోందని సీపీ సజ్జనార్ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా పేట్ల బురుజులోని కార్ హెడ్‌క్వార్టర్స్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన సీపీ.. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు అత్యంత పవిత్రమైనదని, స్వాతంత్య్రం కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. దేశ భద్రత కోసం వేలాది మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. ఇందుకోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని వివరించారు. పోలీసింగ్‌లో మానవీయ దృక్పథం ఉందన్న ఆయన.. విక్టిమ్, సిటిజన్ సెంట్రిక్ అప్రోచ్‌తో బాధితులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేసే వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేశామని గర్వంగాపేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల కేసుల్లో తక్షణ చర్యలు, 24/7 స్పందన ఉంటుందని తెలిపారు. యాప్ ద్వారా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని సజ్జనార్ వివరించారు. కేసులు నమోదు చేయడమే కాదు..బాధితులకు న్యాయం అందేవరకూ పోలీసులదే బాధ్యత అని స్పష్టం చేశారు. నేరాల నివారణెళి లక్ష్యంగా విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కఠిన చర్యలు




తీసుకుంటున్నామని, అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ద్వారా రోడ్డుప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని సీపీ తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి చేశామని.. ప్రాణ రక్షణెళి ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు సీపీ. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా, వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసమే పోలీసింగ్‌కు బలమని, శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచామని చెప్పారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యమని ఆయన అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విలువల పట్ల అందరూ నిబద్ధత చూపాలని తెలిపారు. చట్టం అందరికీ సమానమని, న్యాయం అందరి హక్కు అని సజ్జనార్ స్పష్టం చేశారు.

# అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు

(మొదటి పేజీ తరువాయి)

అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించిన తొలి భారతీయుడిగావ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా రికార్డుకెక్కారు. భారత్ సొంతంగా చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్ర'ను అందజేశారు.

## మేడారాన్ని సందర్శించిన
# మావోరి తెగ ప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని అన్నారు. ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు.



అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క?సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను సన్మానించారు.

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# భారత్ నూలుపై సుంకాలు విధించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది. జనవరి చివరి నాటికి భారత నూలుకు సుంకం లేని దిగుమతి సౌకర్యాన్ని ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా అన్ని స్పిన్నింగ్ యూనిట్లలో కార్యకలాపాలు నిలిపేస్తామని దేశీయ మిల్లర్లు హెచ్చరించారు. చాలా ఏళ్లుగా సుంకం లేకుండా భారత్ నుంచి చౌకగా నూలును దిగుమతి చేసుకుంటుండడం వల్ల స్థానిక స్పిన్నింగ్ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు లేఖలో పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ వస్త్ర పరిశ్రమలో 12వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని తెలిపారు. 50కి పైగా వస్త్ర పరిశ్రమలు మూసేయడం వల్ల వేలాదిమంది కార్మికులు నిరుద్యోగులుగా మారారన్నారు. మరోవైపు బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ వర్గాల డిమాండ్‌ను అక్కడి వస్త్ర ఎగుమతిదారుల సంఘం వ్యతిరేకిస్తోంది. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న నూలుతో పోలిస్తే స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న నూలు ఖరీదైనదని ఎగుమతిదారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్లు, మెరుగైన నాణ్యత విషయాల్లో ప్రపంచ దేశాలు భారత్‌లో ఉత్పత్తి అయ్యే నూలుకు ప్రాముఖ్యత ఇస్తాయన్నారు. ఇప్పుడు భారత్‌కు ఉన్న డ్యూటీ-ఫ్రీ సదుపాయాన్ని నిలిపివేస్తే అక్కడి నుంచి ఎగుమతులు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రపంచ దుస్తుల మార్కెట్‌లో పోటీని బంగ్లాదేశ్ ఎదుర్కోలేదన్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా
# మోడీ తలపాగా

(మొదటి పేజీ తరువాయి)

ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్‌సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు. 2019లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2024లో రెండోసారి ఎన్నికయ్యారు.

2029 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. అంతకుముందు ఆమె 2005 నుంచి 2019 వరకు జర్మనీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. మరోవైపు, భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో ఆ ఒప్పందం జరిగే అవకాశం ఉంది.



# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు



(మొదటి పేజీ తరువాయి)

పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంఛర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుమడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ



కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చన్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.



## తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో
# పెరిగిన ఇమేజ్



(మొదటి పేజీ తరువాయి)

26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అదదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి



నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ



హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్



## విద్యుత్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



**వెల్దండ జనవరి 27 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన వసంతపు వెంకటయ్య (55) విద్యుత్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్దండ ఎస్సై కురుమూర్తి తెలిపారు.. వెల్దండ ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం..

గత నెల 21 న వ్యవసాయ పొలంలో మరమ్మతుకు గురైన ట్రాన్స్ ఫార్మర్ వద్ద హెడ్ పీస్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదంతో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

వెంకటయ్య భార్య తిరుపతమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు

# మహనీయుల ఆశయాలను సాధిద్దాం

- సరోజ బాల ఠాగూర్
- వివేక విద్యా భారతి పాఠశాలలో రిపబ్లిక్ డే వేడుకలు



**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ (డీజీ) ఆఫ్ ఎన్.సీసీ సరోజ బాల ఠాగూర్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని వివేక విద్యా భారతి పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సరోజ బాల ఠాగూర్ ముఖ్య అతిథులుగా హాజరై డాక్టర్ డి పుల్లయ్య, పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మహమూద్ లతో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్.సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్)లో చేరడం వల్ల విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి మరియు శారీరక దృఢత్వం పెరుగుతాయన్నారు. డిఫెన్స్ (ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్), పారా మిలిటరీ మరియు పోలీస్ ఉద్యోగాలలో సీ' సర్టిఫికేట్ హోల్డర్లకు ప్రత్యేక రిజర్వేషన్లు, బోనస్ మార్కులు, రాత పరీక్ష మినహాయింపు వంటి గొప్ప ప్రయోజనాలను అందిస్తుందని తెలిపారు. అనంతరం ఎన్ సీసీ లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు మల్లేష్, కరుణాకర్, విజేందర్, నజీర్, భరత్, అజ్రా, స్వప్న, రత్నకుమారి, అరుణ, షమీం, కీర్తి, మీనా, స్వాతి, శంకర్, అంజు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

**మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్**

**ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు**

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** ఆరు గ్యారంటీ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ విమర్శించారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ పాల్గొన్నారు. సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్, వైస్ చైర్మన్ దోనాధుల సత్యం పాల్గొన్ని పార్టీ నాయకులతో జెండాను ఆవిష్కరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

వేడుకల్లో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, సయ్యద్ ఖలీల్, వస్పుల సాయిలు, ఎంగలి రఘు, నిరంజన్ గౌడ్, జహంగీర్, కమఠం వెంకటయ్య, సైదులు గౌడ్, వడ్డెమోని శివకుమార్, పంతు నాయక్, నాగిళ్ళ జగన్, కొమ్ము ప్రసాద్, ఏనుమళ్ళ రమేష్, జంతుక కిరణ్, రంజిత్, వరికుప్పల గణేష్, తోట కృష్ణ, మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, లండం యాదయ్య, రమేష్ నాయక్, గణేష్ నాయక్, లండం యాదగిరి తదితరులు ఉన్నారు.





## అంబేద్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి

**- పంచాయితీ సెక్రటరీ ప్రసాద్**

**- సింగంపల్లి గ్రామంలోఅంబేద్కర్ విగ్రహావిష్కరణ**

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** అంబేద్కర్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని సింగంపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, సర్పంచ్ శానమోని సత్యం ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పేదరికం నుంచి బయట పడాలంటే చదువు ఒక్కటే మార్గమని యువతకు హితవు పలికారు. వ్యసనాలకు బానిస కాకుండా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. బడుగుల జీవితాలు మార్చడానికీ అంబేద్కర్ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం నేటి పాలకులుఅమలు చేసి బడుగు బలహీనుల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చింతకింది రవీంద్ర, వార్డ్ సభ్యులు నరసింహ, అయోధ్య, అలివేలు, సత్యం, మంజుల, తానీషా, జ్యోతి మరియు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఆమనగంటి యాదయ్య, ఉపాధ్యక్షులు బోడిగల బాలరాజు, మాజీ ఎంపిటిసి గుంపెని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆమనగంటి ప్రేమలత, మాజీ ఉపసర్పంచ్ గుంపెని పోశాలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. వేడుకల్లో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, సంపత్, కండె పాండు రంగయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, సీనియర్ నాయకులు ఖలీల్, ధనుంజయ, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, ఖాదర్ ఖాద్రి, అప్పం శ్రీను, చెన్నారెడ్డి కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీమ్, సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎంగలి ప్రసాద్, పులి కంటి మైసయ్య, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, వగ్గు మహేష్, నాజర్, దేవరశెట్టి మహేష్, కృష్ణ యాదవ్, కుమార్ గౌడ్, రహీం, కరీం, రఫీ తదితరులు ఉన్నారు.



# క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి
- అవురుపల్లి జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ




**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లీగల్ సెల్ ఇంచార్జి వంగ లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మాడుగుల మండలం అవురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి సహకారంతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఇష్టమైన ఆటలో రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు, యువకులకు విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా రానున్న 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి, రెండవ స్థానాల విద్యార్థులకు 5,000, 3,000 నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్, గ్రామ సర్పంచ్ పోషయ్య, ఉప సర్పంచ్ బన్నె చెన్నయ్య, రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ శ్రీరాములు, వార్డ్ సభ్యులు శ్రీనివాసులు గౌడ్, బీరయ్య, బాలమోని వెంకటయ్య గౌడ్, గౌనీ సురేష్ నాయకులు రఘు, కిషోర్ రెడ్డి, రంగారావు, యువజన కాంగ్రెస్ నాయకులు సోప్పరి శ్రీకాంత్, వంగ శ్రీకాంత్ రెడ్డి, బాలమోని మహేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## సమాన అవకాశాలు దక్కాలి

**- మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా**

**- ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు**

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా అన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని సోమవారం పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి ఆమె జాతీయ జెండా ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ యాట గీత నర్సింహా మాట్లాడుతూ.. త్యాగాల పునాదులపై సాధించుకున్న దేశ స్వాతంత్ర్యానికి అసలైన సార్థకత చేకూర్చేందుకు మహనీయుల ఆశలు, ఆశయాలు నెరవేరాలని పేర్కొన్నారు. వేడుకల్లో మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, సంపత్, తాళ్ల రవీందర్, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, జంగయ్య, కండె పాండు రంగయ్య మార్కెట్ సిబ్బంది రాజ్యలక్ష్మి, వినోద్, కృష్ణ, కిరణ్, బిచ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బెంచులను ప్రారంభించిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం...



**కల్వకుర్తి, జనవరి 26(అక్షరగళం):** కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కమాన్ నుండి ఇందిరా నగర్ కాలనీ వరకు కీర్తిశేషులు కారువంగా లక్ష్మయ్య గౌడ్ సత్యమ్మ జ్ఞాపకార్థం సోమవారం వారసులైన కారువంగ రాజు గౌడ్ మోహన్ గౌడ్ బెంచీలను బాటసారుల సౌకర్యార్థం వేయించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం రాయచోటి శ్రీశైలం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ బాటసారుల ప్రజల సౌకర్యార్థం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు భోజిరెడ్డి సైదులు గౌడ్ తోపాటు బిఆర్ఎస్ నాయకులు నాగేష్ శ్రీధర్ శేఖర్ గౌడ్ బండారి శ్రీను ఓం ప్రకాష్ ఆంజనేయులు నేరేటి శేఖర్ కిరణ్ కళ్యాణం వెంకటయ్య రవి సాగర్ రాజు యాదవ్ దర్గా బాలయ్య గౌడ్ శ్రీను నార్ల కంటి శ్రీనివాస్ చంద్రయ్య మహేష్ గోరేటి శివశంకర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## వెల్దండ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షునిగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ జనవరి 27 (అక్షర గళం):** గణతంత్ర దినోత్సవ పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. వెల్దండ రిక్రియేషన్ క్లబ్ నూతన అధ్యక్షునిగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యదర్శి పూరి శివకుమార్, క్రీడా కార్యదర్శిగా అమర్నాథ్ యాదవ్ లను ఎన్నుకున్నారు.

## జాతీయ జెండాను ఎగురవేసిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు

**కల్వకుర్తి,జనవరి 26(అక్షరగళం):** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరి రమేష్ బాబు సోమవారం హైదరాబాద్ కొంపల్లి లోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నూతన భవనం వద్ద జాతీయ







జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఆవశ్యకతను వివరించారు. 2026 సంవత్సరంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా చేపట్టే ప్రతి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరికి గణతంత్ర వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి శ్రీనివాస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గుండూరులో ఎమ్మెల్యేచే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- కాంగ్రెస్ నాయకులు నంబి శంకర్**

**కల్వకుర్తి, జనవరి 26(అక్షరగళం):** కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నంబి శంకర్ సోమవారం మీడియాకు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త సురభి వెంకటేశ్వరరావు సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అనారోగ్యంతో చికిత్స పొందిన దరఖాస్తు చేసుకున్న బాధితులకు పంపిణీ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు వార్డు సభ్యులు కార్యకర్తలు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

## కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షైక్‌కు ఉత్తమ మున్సిపల్ కమిషనర్‌గా అవార్డు పురస్కారం

**కల్వకుర్తి, జనవరి 26(అక్షరగళం):** కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్ కు 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సోమవారం నాగర్ కర్నూలు జిల్లాలో జరిగిన



ఉత్తమ అవార్డుకు ఎంపికైన మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్ కు నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ ఎస్పీ ఎంపీ చేతుల మీదుగా అవార్డు పురస్కారాన్ని స్వీకరించారు.

## గోపాలమిత్ర జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మొగులయ్యకి ఘనంగా సన్మానం

**వెల్దండ, జనవరి 26 (అక్షర గళం):** గోపాలమిత్ర జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కలకొండ మొగులయ్యను సోమవారం వెల్దండ మండల కేంద్రంలో మాదిగల ఐక్యవేదిక సమక్షంలో ఘనంగా సన్మానించారు వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన



గోపాలమిత్ర మొగులయ్యను నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో గోపాల మిత్రులు జిల్లా అధ్యక్షులుగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాదిగల ఐక్యవేదిక నాయకులు ఆయనను శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

మొగులయ్య మరిన్ని ఉన్నత పదవులు అనుభవించి గోపాలమిత్రల సమస్యలపై పోరాడుతానని అన్నారు ఈ కార్యక్రమంలో మాదిగల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, ఐక్యవేదిక నాయకులు గుద్దేటి ప్రభాకర్, దూళ్ళ సామేల్, మంగళగిరి శ్రీను , తలారి జంగయ్య,బద్రి, జగదీశ్వర్, అశోక్, మంగల్ శెట్టి మల్లేష్ , కొమ్ము అంజయ్య, ఈదులపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానంతో సమాజానికి సేవ

### టీపీసీసీ సభ్యులు సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** ఆకలితో ఉన్నవారికి అన్నప్రసాదం పంపిణీ చేయడం మహత్తర సేవ అని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కీర్తిశేషులు అయిళ్ల శంకరయ్య గౌడ్ 34 వ వర్ధంతి సందర్భంగా సోమవారం కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి చెన్న కిషన్ రెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవల్లో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. బస్టాండ్ కు వచ్చే ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా 400 మందికి అన్నదానం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్, క్లబ్ సభ్యులు వెంకటేష్, జహంగీర్ అలీ, బిచ్య నాయక్, శంకర్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, పీఆర్ఓ పాషా పాల్గొన్నారు.



# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**వెల్దండ జనవరి 26 (అక్షర గళం):** వెల్దండ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రజాప్రతి నిధులు, అధికా రులు, నాయకులు, ఉద్యోగులు, కార్మికులు, విద్యా ర్థులు, యువకులు, మహిళలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించు కొని పాఠశాలల విద్యార్థులు పూరవిధుల గుండా జాతీయ గీతాలు








ఆలాపిస్తూ ప్రభాత బేధి నిర్వహించారు. జాతీయ రహదారిపై విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు వివిధ కులాల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వతంత్ర సమరయోధు లను స్మరించుకున్నారు. గణతంత్ర దినోత్సవ సంద ర్భంగా పలు పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ నేతల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవం పురస్కరించు కొని పాఠశాలల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ కార్తీక్ కుమార్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్సై కురుమూర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి గ్రామపంచాయతీ దగ్గర సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ వెలుగు కార్యాలయం వద్ద ఏపీఎం శ్రీదేవి పశు వైద్య ఆస్పత్రి వద్ద పశు వైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్ ఆస్పత్రి వద్ద వైద్య అధికారి డాక్టర్ సింధు పాలకేంద్రం వద్ద చైర్మన్ ఎండి యాకోబు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ అంబేద్కర్ యూత్ అధ్యక్షులు ఈదులపల్లి అనిల్ కుమార్ నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి రాజ్యాంగానికి ప్రజలు హక్కులకు అంకితమైన రోజు..

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి, జనవరి 26(అక్షరగళం):** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకోవడం వేడుక కాదని ప్రజాస్వామ్యానికి రాజ్యాంగానికి ప్రజల హక్కులకు అంకితమైన దినమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం మీడియాతో మాట్లాడారు. దేశానికి 1947లో స్వాతంత్రం దినోత్సవ వచ్చిందని 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చి ప్రజలే పాలకులనే దేశానికి వచ్చిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సమానత్వం న్యాయం స్వేచ్ఛ సౌభ్రావుతత్వమనే నాలుగు స్తంభాలపై ఈ దేశాన్ని నిలబెట్టిందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరిని ఆలోచింపజేసే విధానాన్ని ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఎంతైనా రాజ్యాంగం ఇచ్చిన హక్కులు ప్రతి పేదవాడికి చేరుతున్నాయా అని ఆహారం ఆరోగ్యం విద్య వంటి మౌలిక అవకాశాలు ప్రతి కుటుంబానికి భరోస ఉన్నాయా అని అన్నారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గా నేను ఒకటే చెప్తున్నానని ఆకలితో ఉన్నవాడు స్వేచ్ఛను ఆస్వాదించలేడని కడుపు నిండితేనే రాజ్యాంగం అర్థం అవుతుందని అందుకే ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు కేవలం అధికార రాజకీయాలు కాదని ప్రజా రాజకీయం చేయవలసిన సమయం అని పేర్కొన్నారు. 77 సంవత్సరా లుగా గణతంత్ర ప్రయాణంలో మన దేశం ఎన్నో విజయాలు సాధించి అదే సమయంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదని ఈ సవాళ్లకు సమాధానం మన రాజ్యాంగంలో ఉందని ప్రజలు ఐక్యతతో ఉంది గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఒక



సంకల్పం చెద్దామని రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని ప్రజాస్వామ్యాన్ని బలోపితం చేసి పేదవాడి హక్కు చివరి వరకు నిలబెడుదామని పిలుపునిచ్చారు.






# పడకల్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

### డోకూరి సునిత ప్రభాకర్ రెడ్డి.

**కల్వకుర్తి, జనవరి 26(అక్షరగళం):** పడకల్ గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు దిశలవారీగా గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామని పడకల్ సర్పంచ్ డోకూరి సునిత ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో




పాల్గొని జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో డోకూరి సునిత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పడకల్ గ్రామాన్ని రూపురేఖలు మారుస్తామని అందుకుగాను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాల నిధులను మంజూరు చేయించి ఆదర్శ గ్రామంగా



తీర్చిదిద్దేందుకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గ్రామ ఉపసర్పంచ్ జిరుకుంట రాఘవేందర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com



# అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్

## నాలెడ్జ్ ఐకాన్ స్కూల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ లో గల నాలెడ్జ్ ఐకాన్ స్కూల్‌లో గణ తంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ లు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాలెడ్జ్ స్కూల్ ప్రిన్సిపల్ అరుణ, బస్తీ వాసులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జగద్గిరిగుట్టలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట, ఇందిరాగాంధీ చౌరస్తాలో ఉమ్మడి జగద్గిరిగుట్ట కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పంతుల సాయికుమార్ పటేల్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశభక్తి నినాదాలతో పరిసర ప్రాంతాన్ని మారుమోగించారు.అనంతరం ప్రజలకు టిఫిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, ఎన్ఎస్యుఐ నాయకులు , పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

## మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

**అక్షర గళం, మియాపూర్:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం మియాపూర్ సర్కిల్ 48 కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో దేశభక్తి వెల్లివిరిసింది. జీహెచ్ఎంసీ డిప్యూటీ



కమిషనర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కార్యాలయ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్లు , ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లారెడ్డి నగర్‌లో ఘనంగా శ్రీ స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ

**అక్షరగళం, కుత్బుల్లాపూర్:**
గాజులరామారం డివిజన్ పరిధిలోని మల్లారెడ్డి నగర్ లో సోమవారం ఏర్పాటు చేసిన శ్రీ స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి అధ్యక్షులు వై.పద్మగిరి చేతుల మీదుగా విగ్రహఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమం లో జనరల్ సెక్రటరీ డి. సికిందర్ రావు, ఉపాధ్యక్షులు యన్. ఓంకార్ రెడ్డి, సి. శివరాజ్, డి. హన్మంత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు జి. రాంరెడ్డి, జి. కిష్టా రెడ్డి, ట్రెజరర్ జి. సూర్యచంద్ర రావు, ఆర్గనైసింగ్ సెక్రటరీలు జి. నారాయణ నాయుడు, సి హెచ్ సుబ్బిరామి రెడ్డి, కల్చరల్ సెక్రటరిలు వి. రవిచంద్ర,యం ఆర్ పెంటేష్, మాజీ అధ్యక్షులు కె. బాలరాజు, డి. శ్రీనివాసు, జి. దయాకర్ రెడ్డి, పి. లక్ష్మి రెడ్డి, అడ్వైసర్లు తెలంగాణ సాయి, ఏ. వి రావు, టి. రమేష్ కార్యవర్గ సభ్యులు కె. మల్లికార్జున్, ఏ. శ్రీనివాస రావు, యస్. సంతోష్ రెడ్డి, బి. వెంకట్ రెడ్డి, కె పి. బ్రహ్మం, బి. శ్యామసుందర్, మల్లారెడ్డి నగర్ కాలనీ వాసులు , ఇతర కాలనీ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆంధ్రజ్యోతి వర్సెస్ బీఆర్ఎస్

- మళ్లీ మొదటికి వచ్చిన పాత శత్రుత్వం
- తమ పార్టీ కార్యాలయాల్లోకి ఆంధ్రజ్యోతి,
- ఏబీఎన్ ప్రతినిధులు రావద్దన్న గులాబీ పార్టీ
- ఏబీఎన్ డిబేట్లకు బీఆర్ఎస్ ప్రతినిధులు రారని ప్రకటన
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనూ ఇదే పరిస్థితి
- కేసీఆర్, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ మధ్య వైరం
- ఫోన్ ట్యాపింగ్ కేసుపై వార్తలతో పరాకాష్ఠకు

**హైదరాబాద్,జనవరి 26 (అక్షరగళం):**
తెలంగాణలో ఎన్నికలు ఇంకా చాలా దూరంలో ఉండగానే.. పొలిటికల్ వార్ ముదురుతోంది. ఓవైపు రాజకీయ పార్టీల మధ్య, మరోవైపు పార్టీలు-మీడియా మధ్య కూడా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇప్పటికే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ మధ్య తీవ్రమైన మాటల, రాతల యుద్ధం జరుగుతోంది. సింగరేణి నైనీ బ్లాక్ బొగ్గు టెండర్ల అంశమై ఇద్దరి మధ్య విమర్శలు-ప్రతి విమర్శలు తీవ్రంగా నడుస్తున్నాయి. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్-ఆంధ్రజ్యోతి విషయంలోనూ అదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఈ మీడియా అంటే బీఆర్ఎస్ నాయకులకు తీవ్రమైన ఆగ్రహం ఉంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉండగా చాలా అంశాల్లో ఆంధ్రజ్యోతి నాటి ప్రభుత్వంతో తీవ్రంగా విభేదించింది. రెండేళ్ల కిందట బీఆర్ఎస్ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి మారినా.. ఆంధ్రజ్యోతి ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తోంది. దీనికి తగ్గట్లే ఏబీఎన్ చానల్లో డిబేట్లు జరుగుతుంటాయి. కాగా, తాజాగా జరిగిన డిబేట్ లో ప్రజెంటేటర్ వెంకటకృష్ణకు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు మధ్య జరిగిన సంవాదం చోటుచేసుకొని వివాదానికి దారితీసింది.

### రవీందర్ రావు వ్యాఖ్యలతో..

కొద్ది రోజుల కిందట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్.. విచారణకు పిలిచింది. మేరకు కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. అయితే, ఈ సందర్భంగా సిట్ విచారణ జరిపిన తీరు ఏబీఎన్ డిబేట్ లో ప్రస్తావనకు వచ్చింది. దీంతో మీడియాలో వచ్చిన కథనాలను ఎమ్మెల్సీ రవీందర్ రావు పరుష పదజాలంతో విమర్శించారు. పిచ్చి నా.. అంటూ నోరు జారారు. దీనిని వెంకటకృష్ణ ఖండించారు. రవీందర్ రావును కంట్రోల్ చేసుకోవాలని కోరారు. ఆ మాటలను వెనక్కు తీసుకోవాలని సూచించారు. కానీ, రవీందర్ రావు మాత్రం వెనక్కు తగ్గలేదు. తన మాటలను వెనక్కు తీసుకోనని స్పష్టం చేశారు. ప్రజెంటేటర్ ఎంతగా నచ్చజెప్పినా ఆయన వినలేదు. దీంతో చివరకు చేసేదేమీ లేక వెంకటకృష్ణ.. 'గెటవుట్ ఫ్రం మై డిబేట్' అంటూ తేల్చి చెప్పారు. దీనిని పదే పదే రిపీట్ చేశారు. చివరకు రవీందర్ రావు మైక్ ను కట్ చేయించారు. అయితే ఈ పరిణామమే ఇప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ ఏబీఎన్ గా మారింది.

### మళ్లీ పాత రోజులు..

కానీ.. శత్రుత్వ వైఖరి కొనసాగింది. చివరకు బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనంతరం ఈ 26 నెలలుగా ఆంధ్రజ్యోతితో బీఆర్ఎస్ కు అదే శత్రుత్వ వైఖరి కొనసాగుతోంది. ఇటీవల ఏబీఎన్ డిబేట్లో తమ ఎమ్మెల్సీ రవీందర్ రావు పట్ల ప్రజెంటేటర్ వెంకటకృష్ణ దురుసుగా ప్రవర్తించాడంటూ బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. రవీందర్ రావు తెలంగాణ ఉద్యమకారుడని,





వాస్తవానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ చాలా సన్నిహితులు. వీరిద్దరి కుటుంబాల మధ్య కూడా మంచి అనుబంధమే ఉంది. కేసీఆర్ గురించి నాలుగు దశాబ్దాలకు పైగా తెలిసిన రాధాకృష్ణ.. బీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో మాత్రం విభేదించారు. ఒక దశలో ఏబీఎన్ చానెల్ ప్రసారాలను బీఆర్ఎస్ ప్రభుత్వం బ్యాన్ చేసింది. ఆ తర్వాత కొంతకాలానికి ఇరువురికి మధ్య మళ్లీ సత్సంబంధాలు ఏర్పడినా.. 2018లో బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక మళ్లీ పాత కథే పునరావృతం అయింది. ఈ సారి నిషేధం విధించలేదు

ఆయన పట్ల వెంకటకృష్ణ వ్యవహరించిన తీరు సరికాదని పేర్కొంది. దీనికి నిరసనగా.. ఇకమీదట ఏబీఎన్ చానెల్ డిబేట్లలో తమ పార్టీ నుంచి ఎవరూ పాల్గొనబోరని ప్రకటించింది. అంతేకాకుండా.. పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్, జిల్లా కార్యాలయాల్లో జరిగే సమావేశాలకు ఇకపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ప్రతినిధులను అనుమతించబోమని ట్వీట్ చేసింది. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఎటువైపు వెళతాయో, రాష్ట్ర ప్రయోజనాలు ఏమవుతాయోనన్న ఆందోళనను ప్రజాస్వామ్యవాదులు వ్యక్తం చేస్తున్నారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**అక్షరగళం, కూకట్‌పల్లి:**
నగరంలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను బాలానగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేశారు. సోమవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి సీఐ నర్సింహారాజు, డిఐ సక్రమ్, ఎస్ఐ సరితా రెడ్డి తోకలిసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న బాలానగర్ ఐడీపీఎల్ హట్స్ సమీపంలోని ప్రహ్లాద్ టింబర్ డిపో పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన డీసీఎం (ఏపీ10బీడి 2015) చోరీకి గురైంది. వాహన యజమాని యూసఫ్ బాబా ఈ నెల 21న విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న క్రైమ్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీటీవీ ఫుటేజ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సుమారు 350 కిలోమీటర్లు దాదాపు 225 సీసీటీవీలు పరిశీలించి నిందితులు కర్ణాటకలోని బసవకళ్యాణ్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారి కదలికలపై నిఘా ఉంచి, నిందితుల నివాస స్థావరంపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా, దొంగిలించిన డీసీఎం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా, కోరేలి గ్రామంలో దాచినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసులు ఈ కేసులో ఇద్దరు




నిందితులు మహమ్మద్ ఖదీర్ (35), మహమ్మద్ తాజుద్దీన్ (42) లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు దిగ్య, ఫాకరుద్దీన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఏసీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ. 3.5 లక్షల విలువైన డీసీఎం వాహనంతో పాటు జనరేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమర్థవంతంగా పనిచేసి నిందితులను పట్టుకున్న క్రైమ్ బృందం ఏఎస్ఐ హనుమయ్య, పీసీలు కృష్ణ, ఇఫతేకర్, శ్రీనివాస్, జకీర్ లను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించి నగదు పురస్కారాలు అందించారు.

## ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**అక్షర గళం, శేరిలింగంపల్లి:**
77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కార్యాలయం, ఛత్రపతి శివాజీ నగర్, జీఎస్ఆర్ నగర్, సాయి నగర్ వెస్ట్, అల్విన్ కాలనీ ఫేస్ 1, వెంకటపాపయ్య నగర్, తులసి నగర్, చక్రదారి నగర్, అంబేద్కర్ నగర్, దత్తాత్రయ కాలనీ ఫేస్ 1, దత్తాత్రయ కాలనీ ఫేస్ 2, గుడ్ విల్ హోటల్ చౌరస్తా, ఖాజా నగర్, ఎన్టీఆర్ నగర్, జయశంకర్ కాలనీ, రవిదాస్ మందిర్, పిజేర్ నగర్, మొగులమ్మ కాలనీ, శంషిగుడా వార్డ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, జెండావందనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, కాలనీ వెల్ ఫెయిర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## మాధవరం నగర్ కాలనీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**అక్షర గళం, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని వివేకానంద నగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొని జాతీయ జెండాను స్థానిక నాయకులతో కలిసి ఎగరవేశారు.

అనంతరం వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన జాతీయ జెండా కార్యక్రమంలో స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.



## ఉత్తమ పోలీస్ అధికారిగా అవార్డు పురస్కారాన్ని అందుకున్న కల్వకుర్తి సీఐ నాగార్జున

**కల్వకుర్తి, జనవరి 26(అక్షరగళం):** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులకు ఎంపికయ్యారు. శాంతి బద్ధతుల పట్ల అంకితభావంతో ప్రజలకు సేవలు విధులను నిర్వహిస్తు గుర్తింపు పొంది బాధ్యతతో పనిచేస్తున్న కల్వకుర్తి సీఐ బి.నాగార్జునకు ఉత్తమ అధికారిగా జిల్లా ఎస్పీ ఎంపీ మల్లు రవి చేతుల అవార్డు పురస్కారాన్ని అందుకున్నారు.



## పరామర్శ

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):**
ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన నేనావత్ రామ్ సింగ్ ఆదివారం ఆకస్మికంగా మరణించారు. విషయాన్ని తెలుసుకున్న బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సోమవారం రామ్ సింగ్ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా 6500 రూపాయలు అందజేశారు. ఆయన వెంట తావుర్య నాయక్, మణిపాల్ నాయక్, మల్లేష్ రాజ్, పురుషోత్తం, రాజశేఖర్, జైరాం, నందు రాథోడ్, రమేష్, లక్ష్మణ్, రాజా, పాండు, గోపి, మల్లేష్, జితేందర్, శివ తదితరులు ఉన్నారు.

## పార్టీ బలోపేతంలో గ్రామ కమిటీలు కీలకం

**- మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ**

**ఆమనగల్లు, జనవరి 26 (అక్షర గళం):** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాల్సిందేనని, గ్రామ స్థాయి కమిటీలే పార్టీకి పునాదులని మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిట్ట నారాయణ అన్నారు. ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకుతోట పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నారాయణ



ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి నిబద్ధతగా, నిరంతరం పనిచేసే కార్యకర్తలనే గ్రామ కమిటీల్లో నియమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుండిగల్ సర్కిల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:**

77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ దుండిగల్ 295 డివిజన్ డబల్ బెడ్రూం సముదాయంలో సోమవారం ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ కౌన్సిలర్లు జక్కుల శ్రీనివాస్, శంకర్ నాయక్, బీఆర్ఎస్ దుండిగల్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ నల్తూరి కృష్ణ, ప్యాక్స్ డైరెక్టర్లు జీతయ్య, ఈ శ్రీనివాస్, నాయకులు సగ్గిడి శ్రీనివాస్ నర్సింగ్ గౌడ్, శ్రీధర్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:**
77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో టీయూడబ్ల్యూజే-ఐజేయు కుత్బుల్లాపూర్ యూనియన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు గొల్లపల్లి దయాకర్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశభక్తి, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య ప్రాధాన్యతపై సందేశం ఇచ్చారు. భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గౌరవించాలని ఆయన పిలుపు నిచ్చారు. మీడియా సమాజానికి మార్గదర్శిగా నిలవాలని, సత్యం, నైతికతతో కూడిన జర్నలిజాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, గౌరవ సలహాదారులు గుంటూరు శేఖర్, మాజీ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్‌తో పాటు యూనియన్ సభ్యులు పాల్గొని వేడుకలకు మరింత వైభవం చేకూర్చారు. గణతంత్ర దినోత్సవాన్ని ఐక్యత, దేశభక్తి భావంతో జరుపుకోవాలని పాల్గొన్న నాయకులు పిలుపునిచ్చారు.







# విద్యార్థులు మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

- కుర్మిద్ద గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు
- ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- 3వ వార్డు సభ్యులు గోపలి కల్పన మహేందర్
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేత
- విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందజేత
- 2వ వార్డు సభ్యులు సముద్రాల ప్రవీణ్
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

**యాచారం, అక్షరగళం:**
విద్యార్థులు మహనీయుల అడుగుజాడల్లో నడవాలని కుర్మిద్ద గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని మహనీయుల చిత్రపటాలకు పూల



మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహనీయుల త్యాగాల ఫలితంగానే భారత రాజ్యాంగం లభించిందని, వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారత రాజ్యాంగం అందించిన హక్కులను స్వేచ్ఛ, మానవత్వాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి, మండలానికి,జిల్లాకి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామ మాజీ వార్డు సభ్యులు బందే రాజేందర్ రెడ్డి పంపించిన ప్రథమ బహుమతి నీలం శ్రీనాథ్ కు 10 వేలు, ద్వితీయ బహుమతి కామేటి శాలినికి 5 వేల నగదు బహుమతులను మూడో వార్డు సభ్యులు గోపలి కల్పన మహేందర్, జర్నలిస్ట్ పంది శ్రీను గ్రామపంచాయతీ పాలకవర్గం సమక్షంలో అందజేశారు. పదవ తరగతి విద్యార్థులకు రెండవ వార్డు సభ్యులు సముద్రాల ప్రవీణ్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేసి పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనెమోని రవీందర్, వార్డు సభ్యులు, నీలం విజయలక్ష్మి, నీలం లక్ష్మీదేవి, దండే సంతోషిణి ప్రియ, జంగిలి రమేష్, మడ్డి సురేష్, నందు, ఉపాధ్యాయులు రాణి విరమణి, స్వప్న, అశోక్, శ్రీనివాస్, యువజన సంఘాల నాయకులు, యువకులు, విద్యార్థులు తదితరులున్నారు.





# లోక్‌భవన్‌లో గవర్నర్ ఎట్ హోం

**హాజరైన మంత్రులు, ప్రముఖులు**

**హైదరాబాద్,జనవరి26 (అక్షర గళం):** రిపబ్లిక్ డే సందర్భంగా లోక్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. నేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే ఏకే సింగ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్, బీఆర్ఎస్, భాజపా నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్‌ను జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఎట్ హోం సందర్భంగా రాజ్‌భవన్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

















## బీజేపీ ఎంపీ డా. కె.లక్ష్మణ్‌కు సత్కారం

హైదరాబాద్, అక్షరగళం:

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో రిటర్నింగ్ ఆఫీసర్‌గా కీలక పాత్ర పోషించిన రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్‌ను తెలంగాణ బీజేపీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమం తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ, బీజేపీ విశిష్టమైన సంస్థాగత సంస్కృతి కలిగిన పార్టీ అని పేర్కొన్నారు. అంకితభావం, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేసే సాధారణ కార్యకర్త కూడా పార్టీ అత్యున్నత స్థాయికి ఎదగగల అవకాశాన్ని కల్పించేది బీజేపీ ఒక్కటేనన్నారు. ఇదే బీజేపీని ఇతర రాజకీయ పార్టీలకు భిన్నంగా నిలబెడుతోందని తెలిపారు. సంఘటన్ పర్వ్ వంటి కీలక దశలో డా. కె. లక్ష్మణ్ బాధ్యతాయుతంగా వ్యవహరించడం పట్ల తెలంగాణ బీజేపీ నాయకత్వం గర్వంగా భావిస్తోందన్నారు. ఆయన నిబద్ధత, పారదర్శకత, సంస్థాగత నైపుణ్యం పార్టీ బలాన్ని ప్రతిబింబిస్తున్నాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, చింతల రామచంద్రా రెడ్డి తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**నేడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసన మండలి ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి... డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ , ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్ , చిన్నా**





**రెడ్డి , మల్కా కొమురయ్య , దయానంద్ , తక్కెళ్లపల్లి రవీందర్ రావు , శ్రీపాల్ రెడ్డి,అంజిరెడ్డి , వాణీదేవి , తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహా చార్యులు , తదితరులు పాల్గొన్నారు.**



**జఫర్ గఢ్ - జనగామ జిల్లా తెలంగాణ ఉద్యమకారులు గాదె ఇన్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

## నేడు గవర్నర్‌ను కలవనున్న బీఆర్ఎస్ బృందం

హైదరాబాద్, అక్షరగళం:సింగరేణి కుంభకోణం అంశంపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతలు నేడు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలవనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై ఫిర్యాదు చేయనుంది.

సింగరేణి సంస్థలో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని యథేచ్ఛగా లూటీ చేశారంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రుల పాత్రపై



సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేయనుంది. ఈ వ్యవహారానికి సంబంధించిన సాక్ష్యాధారాలతో కూడిన వివరమైన నివేదికను గవర్నర్‌కు సమర్పించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి..ప్రతిష్టాత్మకమైన సింగరేణి సంస్థను రాజకీయ లాభాల కోసం దోచుకుంటున్నారని ఆరోపించిన బీఆర్ఎస్, ఈ భారీ కుంభకోణానికి బాధ్యులైన వారికి పదవుల్లో కొనసాగేందుకు నైతిక, రాజ్యాంగ హక్కు లేదని స్పష్టం చేసింది. ఈ భేటీలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలు పాల్గొని తమ నిరసనను గవర్నర్‌కు తెలియజేయనున్నారు.



## ముగ్గు ఇంటికి ముందు కళ

**గణతంత్ర దినోత్సవ సందర్భంగా రంగవల్లుల పోటీలు**

**ముఖ్య అతిథిగా హాజరైన కావ్య కిషన్ రెడ్డి. భరత్ గౌడ్**

సికింద్రాబాద్: 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బౌద్ధ నగర్ లోని అంబర్ నగర్ బస్తీ బాల్వాడీ విద్యాలయం సమీపంలో ప్రమోద్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు ఘనంగా నిర్వహిం చారు. జి. కావ్య కిషన్ రెడ్డి – జిల్లా బిజెపి అధ్యక్షులు భరత్ గౌడ్ –ముఖ్య అతిథులుగా పాల్గొని, ముగ్గుల పోటీల్లో గెలు పొందిన మహిళలకు విద్యార్థినిలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, గణతంత్ర దినో త్సవ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోష మని, ఇంటికి ముందు ముగ్గులు ఇంటికి కాంతి నిస్తుందని పరి సరాలు కూడా శుభ్రంగా ఉంటూ ఆహ్లాద



కరంగా కరంగా కనిపిస్తాయని అన్నారు.

డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో.. మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, నాగరాజు, సాయి నాని, కొమరయ్య ,అరవింద్, సత్యనారాయణ, శ్రీధర్, అఖిల్, వినయ్ ,భరత్, జయంత్, అమరావతి, ప్రభావతి, రూపసాయి, సోను, నవీన్ బండారి, తిమోతి, చంద్రకళ, మహేశ్వరి, విజయ. తదితరులు పాల్గొన్నారు.

## ఫోరం ఫర్ ఆర్టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్- తెలంగాణ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుక

మేడ్చల్: 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, మేడ్చల్ జిల్లా మేడ్చల్ పారిశ్రామిక వాడల్లో, ఫోరం ఫర్ ఆర్టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ – తెలంగాణ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్ గుప్తా మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతపై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, ఆ రోజే దేశానికి సంబంధించిన చట్టాలు అమలైనాయని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించిన చట్టాలు, వాటి ద్వారా కలిగే హక్కులు ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సింహులు పటేల్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొని గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ గణతంత్ర దినోత్సవ కార్యక్రమం ఫోరం ఫర్ ఆర్టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొమ్మోజు రమేష్ పిలుపుమేరకు నిర్వహించబడింది.



## సికింద్రాబాద్ టీడీపీ ఆఫీసులో ఘనంగా గణతంత్ర దినోత్సవం

హైదరాబాద్, అక్షరగళం: 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా తెలుగుదేశం పార్టీ, హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. నాయకులందరు జాతీయ పతాకానికి వందనం చేస్తూ జాతీయ గీతం ఆలపించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి వారిని స్మరించుకున్నారు.

సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఈరోజు మన రాజ్యాంగాన్ని అమలు చేసుకున్న సుదినం రోజు. ఈరోజు రాజ్యాంగ విలువన్ని కాపాడుకోవడానికి అందరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పుడున్న దురదృష్ట పరిస్థితే మంటే రాజ్యాంగ వ్యవస్థను బలహీన పర్చడానికి కుట్రలు జరుగుతున్నాయి.

దేశ ప్రజలందరూ రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదిగా భావించి, రాజ్యాంగ విలువల్ని కాపాడి భావితరాలకు అందించాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, పరుశురాం, మేడిపల్లి శ్యాంసుందర్, రాజేందర్ ప్రసాద్(ఆర్.పి) కరణం కిరణ్, భాను



ప్రకాష్, ఓ.వెంకటేష్ చౌదరి, చంద్రమోహన్ గౌడ్, మతిన్, పి.వీరబాబు, ఎస్.ఎం.లైకొద్దీన్, మచ్చేందర్, జోగేందర్ సింగ్, యాదగిరి, సాయి, ఎం.డి.సలీం, బి రాజు, వెంకట్రాజన్ గౌడ్, అమ్మి నాయుడు, బిక్షపతి చారి, మచ్చేందర్, ఎల్.రవి, సత్తన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగం రోజు - కొన్ని ప్రశ్నలు!

స్వతంత్ర భారత దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు. ఈ సందర్భంగా కుల రాజకీయాలు, కుల ప్రాసంగికత, వక్రత, నిజాల్ని దాచడం, వంచన వంటి వాటికి అతీతంగా ఇకనైనా ఈ దేశ ప్రజకు రాజ్యాంగానికి సంబంధించి కొన్ని ప్రాథమికమైన ప్రశ్నలకు సరైన జవాబులు కావాల్సిన అవసరం ఉంది. ఈ దేశానికి ఇప్పటికైనా జవాబుదారీ తనం కావాలి.

1 మన దేశ రాజ్యాంగానికి అంబేద్కర్ మాత్రమే పూర్తిగా కర్త అవుతారా?

2. మన దేశ రాజ్యాంగానికి ఆధార రచన లేదా మూల రాజ్యాంగాన్ని రాసింది బెనగాల్ నరసింహారావు. ఆయన 1946లో మొదలు పెట్టి, (జర్మనీ ఇంకా కొన్ని ఇతర దేశాల రాజ్యాంగాల్లోని అంశాల్ని తీసుకుని)1948లో మన దేశ మౌలిక లేదా ఆధార రాజ్యాంగాన్ని పూర్తి చేశారు. అటు తరువాత అది అంబేద్కర్ అధ్యక్షుడుగా ఉన్న 8 మంది సభ్యుల కమిటీకి వెళ్లింది. ఆ బెనగాల్ నరసింహారావుకు రాజ్యాంగ రచన విషయంలో ఎందుకు దక్కవలసిన గుర్తింపు, స్థానం దక్కడం లేదు? ఈ అన్యాయం ఎందుకు జరిగింది? ఎలా జరిగింది?

3. రాజ్యాంగం విషయంలో బెనగాల్ నరసింహారావును మరుగు పరచడం ఏ కుట్రలో భాగం?

4. రాజ్యాంగం రచన పరంగా 20కు పైగా కమిటీలు, ఆ కమిటీల అధ్యక్షుల భాగస్వామ్యం, వాళ్ల సేవలు ఎందుకు దాచెయ్యబడ్డాయి?

5. రాజ్యాంగం రచనపరంగా 20కు పైగా కమిటీలు, ఆ కమిటీల అధ్యక్షుల భాగస్వామ్యం లేకుండానే లేదా మరెవ్వరూ లేకుండా రాజ్యాంగం మొత్తం అంబేద్కరే రాశారు అన్న ప్రచారం అసత్యము అవదా?

6. రాజ్యాంగం ఏ ధార్మిక నియమావళి గ్రంథమో, చరిత్ర గ్రంథమో కాదు కదా? అలాంటప్పుడు రాజ్యాంగం ప్రతిలో రాముడు, అర్జునుడు, బుద్ధుడు, మహావీరుడు, అక్బర్, టిప్పు సుల్తాన్, అశోకుడు, కృష్ణుడు చిత్రాల్ని పొందుపరచడం దేన్ని సూచిస్తుంది?

7. లౌకిక మేధావి అంబేద్కర్ రాముడు, కృష్ణుడు, అర్జునుడు, మహావీరుడు, బుద్ధుడు వంటి మత చిహ్నాల్ని లౌకిక రాజ్యాంగంలో చోటివ్వడంలోని ఆంతర్యం ఏమిటి?

(బుద్ధుడు మత చిహ్నం అవని పక్షంలో ప్రపంచంలోని పలు దేశాల్లో బౌద్ధ మతం ఉండడం అబద్ధం అవుతుంది)

8. టిప్పు సుల్తాన్, అశోకుడు, అక్బర్ వంటి చారిత్రిక చిహ్నాలు రాజ్యాంగంలో ఎందుకు ఉండాలి?

9. మానవ హక్కుల ధీమంతుడు అంబేద్కర్?కు అశోకుడు మానవ హక్కుల్ని దారుణంగా కాలరాచేసిన యుద్ధోన్మాది అన్న చారిత్రిక సత్యం తెలుసుకోగలిగిన చదువు లేదా? అశోకుడు బుద్ధావలంబకుడు అయ్యాకే భయంకరమైన కళింగ యుద్ధం జరిగింది అన్నది సరైన చరిత్ర. అశోకుడు తాను రాజయ్యేందుకు తన సోదర, బంధువుల్ని నిర్మూలించాడు. మన దేశంలో తొలి మతన్మాద నరమేధం జరిపించింది అశోకుడే!

కళింగ యుద్ధం తరువాతి కాలంలో తన రాజ్యంలోని ఆజీవిక మతస్థుల్ని, నిర్గ్రంధుల్ని ఊచ కోత కోయించాడు అశోకుడు. అంతర్జాతీయ చరిత్ర పరిశోధకులు ఈ సత్యాల్ని విశ్వవ్యాప్తంగా తెలియ జేశారు. అంబేద్కర్?కు సరైన చరిత్ర తెలియదా? ఆ అశోకుడికి రాజ్యాంగ ప్రతిలో స్థానం ఇవ్వడంలో అంబేద్కర్ ఉద్దేశ్యం ఏమిటి?

10. అక్బర్, టిప్పు సుల్తాన్ వంటి వాళ్లు మన దేశాన్ని పీడించిన లేదా పాలించిన విదేశీ మత రాజులు. స్వతంత్ర దేశ రాజ్యాంగంలో వీళ్లకు చోటు ఎందుకు? వీళ్లకు రాజ్యాంగంలో చోటివ్వడం ద్వారా దేశ ప్రజలకు అంబేద్కర్ ఇస్తున్న సందేశం ఏమిటి?

11. మహావీరుడి ధ్యానం, బుద్ధుడి బోధి, అర్జునుడి తపస్సు, కృష్ణుడి భగవద్గీతా బోధ వంటివి లౌకికత్వానికి, రాజ్య పాలనకు సంబంధించినవా? ఈ చిత్రాల్ని లౌకిక మేధావి అంబేద్కర్ రాజ్యాంగం ప్రతిలో ఎందుకు పెట్టారు?

12. ఈ చిత్రాలు రాజ్యాంగంలో ఉండడానికి అంబేద్కర్ కారణం కాదా? ఆయన బాధ్యత లేదా? ఇతరులు అందుకు కారణమై ఉంటారా? వీటి ఆధారంగానూ రాజ్యాంగ నిర్మాణంలో ఇతరులు పలువురి కృషి ఉంది అని మనం రూఢీ చేసుకోవచ్చా?

13. లౌకిక మేధావి అంబేద్కర్ రాముడు, కృష్ణుడు, అర్జునుడు వీళ్లను చారిత్రిక వ్యక్తులుగా గుర్తించారా? బుద్ధుడు, మహావీరుడు చారిత్రిక వ్యక్తులూ, మత వ్యక్తులూ అయినట్టుగా రాముడు, కృష్ణుడు, అర్జునుడు వీళ్లను కూడా అంబేద్కర్ పరిగణించారా?

రామాయణం, భారతం, భాగవతం నిజంగా జరిగిన చరిత్రలు అని అంబేద్కర్ విశ్వసించి పరిగణించారా?

14. క్రైస్తవం, ఇస్లామ్, కమ్యూనిజమ్ వీటిని అంబేద్కర్ నిరసించడమూ, తిరస్కరించడమూ అవి దేశానికి హానికరం అని చెప్పడం మనం చదివాం; అందువల్లే రాజ్యాంగంలో వాటికి సంబంధించిన చిత్రాలు లేవా? (అక్బర్, టిప్పు సుల్తాన్ చారిత్రిక రాజుల చిత్రాలు)

15. నంది, నటరాజు చిత్రాలు రాజ్యాంగంలో ఉన్నాయి. అవి మత పరమైన చిహ్నాలే. "నేను హిందువుగా మరణించను" అని అన్న లౌకిక మేధావి అంబేద్కర్
ఈ హిందూ మత చిహ్నాల్ని రాజ్యాంగంలో పొందుపరచడం ఏమిటి?

16. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 3యేళ్ల తరువాత అంబేద్కర్ తాను రాసిన రాజ్యాంగాన్ని తానే ఎందుకు తీవ్రంగా వ్యతిరేకించాడు? లేదా అంబేద్కర్ అలా వ్యతిరేకించనే లేదా?

17. రాజ్యాంగం విషయంలో ఒక దశలో అంబేద్కర్ I am quite prepared to burn it.. I dont want it అని ఎందుకు అన్నారు? రాజ్యాంగం సరిగ్గా లేదనో సరికాదనో, సరిగ్గా అమలు కావడం లేదనో, అప్పటి కాంగ్రెస్ పాలకులవల్ల సరిగ్గా అమలు అవదనో అలా అన్నారా? అసలు అలా అనలేదా?

18. దేశానికి కావాల్సిన రాజ్యాంగాన్ని రాసిన మహా మేధావి, లౌకిక శిఖరం, దార్శనికుడు, సంస్కర్త, అయిన అంబేద్కర్, మంత్రిగా పని చేసి కూడా ప్రజాభిమానాన్ని చూరగొనలేక ఎన్నికల్లో ఓడిపోవడం ఏమిటి? అంత గొప్ప అంబేద్కర్‌ను ఈ దేశంలోని పెద్ద శాతం ప్రజలు ఎందుకు ఆమోదించలేదు?

19. సమతా వాది అయి, కుల నిర్మూలనను కోరుకున్న అంబేద్కర్ స్వతంత్ర దేశంలో తొలిసారిగా All India Scheduled Castes federation అన్న 'కులం' పార్టీ పెట్టడం ఏమిటి? ఆ కులం పార్టీ గెలవలేకపోవడం కాదు కదా ఆ కులం ప్రజలే 90% అంబేద్కర్ పెట్టిన కులం పార్టీకి ఓటు వెయ్యక పోవడం దేన్ని సూచిస్తోంది? All The Scheduled Castes Of India అంబేద్కర్‌ను తిరస్కరించిన సత్యాన్ని చరిత్ర మనకు చెప్పడం లేదా?

20. బతికి ఉన్నంత వరకూ ప్రజా దరణకు నోచుకోని అంబేద్కర్ ఏ విధంగానూ పెద్దగా సఫలం కాలేదు; ఇది దేనికి నిదర్శనం?

21. బతికి ఉన్నంత వరకూ అన్ని విధాలుగానూ తీవ్ర నిరాదరణకు గురై, ప్రజలపై, పెద్దగా ప్రభావం చూపించలేని అంబేద్కర్ పేరు మీద గత కొన్ని దశాబ్దులుగా దేశంలో ఎందుకు హడావిడి జరుగుతోంది? అంబేద్కర్ ఆధారంగా, అంబేద్కర్ స్ఫూర్తికి వ్యతిరేకంగా దేశ సామాజిక సామరస్యాన్ని దెబ్బ తీసే కుట్ర జరుగుతోందా?

22. బతికి ఉండగా దేశ ప్రజల తిరస్కారానికి గురై పనికిరాకుండాపోయిన అంబేద్కర్ ఇప్పుడు ఈ ఏ విధంగా ప్రజకు పనికివస్తారు? ఏ సంపాదన కోసం, ఏ లబ్ది కోసం అంబేద్కరిజమ్, అంబేద్కరిస్ట్?స్ జండాలతో రచ్చలు జరుగుతున్నాయి?

23. అంబేద్కర్ అనగానే స్ఫురణకు వచ్చేది మన దేశ రాజ్యాంగమే. ఆ రాజ్యాంగానికి ఆధారం బెనగాల్ నరసింహారావు, ఆ తరువాత 200కు పైగా పలువురి కృషి ఫలితం ఇవాల్టి మన రాజ్యాంగం. పలువురి మేధ, ఆలోచన, కృషి వీటిని అంబేద్కర్?కు మాత్రమే ఆపాదించడం దోపిడి కాదా? అన్యాయం కాదా? దారుణం కాదా? ఈ దారుణం ఏ కుట్రలో భాగం?

24. రాజ్యాంగ నిర్మాణంలో పునాది, కీలకం అయిన బెనగాల నరసింహారావును లేకుండా చేసి రాజ్యాంగ కర్తృత్వాన్ని పూర్తిగా అంబేద్కర్‌కు అంటగట్టడం గత కొన్ని దశాబుద్దులుగా దేశంలో బలపడుతూ వస్తున్న కులోన్మాద కుట్రలో భాగమా? రాజ్యాంగ నిర్మాణంలో బెనగాల నరసింహారావును లేకుండా చేస్తూండడం కుల వివక్ష కాదా?

25. రాంజీ మాలోజీ సక్పాల్ కొడుకు భీంరావ్ సక్పాల్, భీంరావ్ అంబేద్కర్ అయి, చలామణిలోకి వచ్చి, తన జన్మ మతాన్ని వీడి బౌద్ధాన్ని తీసుకున్నాక కూడా ఆ అంబేద్కర్ అనే బ్రాహ్మణ నామాన్ని వదులుకోకపోవడం దేన్ని తెలియజేస్తోంది? అంబేద్కర్ బౌద్ధ 'మతం (లోకి)మారడం' మతతత్వం కాని లౌకికత్వం అవుతుందా? ఒక మతాన్ని తీసుకున్న 'అంబేద్కర్ లౌకిక వాది కాదు' అన్నది సత్యమేనా?

తప్పుడు, కులోన్మాద, కుట్ర పూరిత, సమాజ వ్యతిరేక, అభ్యంతరకరమైన, అవాస్తవ పత్రికా రచనలతో చాల కాలంగా ప్రజల్ని మోసం చేసేందుకు జరుగుతూ వస్తున్న వృద్ధ రచనలు, విష రచనలకు, కాలం చెల్లాల్సిన సమయం ఇది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 77యేళ్ల తరువాతైనా, ఇకనైనా అంబేద్కర్ చుట్టూ ఉన్న ప్రశ్నలకు సరైన జవాబులు అమలులోకి రావాలి. అవి ఈ దేశానికి, దేశంలోని పెద్ద శాతం ప్రజలకు మేలు చేస్తాయి.

## జూబ్లీహిల్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**జూబ్లీహిల్స్‌లో సర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): నగరంలోని జూబ్లీహిల్స్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గం నుంచి చదువుకున్న యువకుడిని నిలబెట్టి ప్రజలే గెలిపించారని పేర్కొన్నారు. రాజకీయాలు వ్యవస్థలో చాలా ముఖ్యమైనవని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్ల పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు ప్రజలకు సేవ చేయాలనే తపన ఉందని, అలాంటి నాయకుడితో కలిసి అభివృద్ధి పనులు చేయించుకోవాలని ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. భవిష్యత్తులో నవీన్ యాదవ్ పెద్ద స్థాయి నాయకుడిగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అంటే చాలా అభివృద్ధి చెందిన ప్రాంతమని అనుకున్నప్పటికీ, ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తీవ్రంగా పెరిగిందని, పరిశ్రమలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని వెల్లడించారు. అలాగే కమలాపురి కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు .



# రాజ్యాంగాన్ని నిత్యం స్మరించుకోవాలి

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**

హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): తెలంగాణలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరి గాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, జాతీయ జండాకు గౌరవ వందనం సమర్పించి, జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగాన్ని గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతి భారతీయుడు తప్పనిసరిగా స్మరించుకోవాలని చెప్పారు. ఈ రాజ్యాంగం హక్కులే కాక, బాధ్యతలనూ కల్పిస్తుందని, ప్రభుత్వాలు ఎలా నడవాలి, ప్రజాస్వామ్యం ఎలా కొనసాగాలి అనే మార్గదర్శకం అందిస్తుందన్నారు. అయితే గతంలో రాజ్యాంగాన్ని అవహేళన చేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి నాయకులు కూడా దాని గౌరవాన్ని ఉల్లంఘించారని ఆయన గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్నా, తరచుగా దాన్ని అవమా నిస్తున్నారని, ఓటు హక్కుని కూడా తప్పుడు ప్రచారంతో దుర్వినియోగిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీ-బీజీ రామ్ చట్టం-2025 గ్రామ స్వరాజ్యానికి నిజమైన బలం ఇస్తుందని, ప్రజాధనం ప్రజల చేతుల్లో ఖర్చు అయ్యేలా చేసే వ్యవస్థను రూపొందించినదని ఎన్. రాంచందర్ రావు వివరించారు. ఇది అవినీతి నివారణలో కీలకమని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదారికి తీసుకెళ్తోందని, దుష్ప్రచారాలతో అడ్డుకల్పన ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, మోడీ ప్రభుత్వం అమలుచేసిన ప్రధాన పథకాలు, ముఖ్యంగా కిసాన్ సమ్మాన్ నిధి, అధికరణం 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, 2019 పౌరసత్వ (సవరణ) చట్టం వంటి చర్యలను గుర్తుచేశారు.

వెంటనే, రాష్ట్రంలో అవినీతి చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించి, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి గెలుపు సాధించాలన్నారు. వేడుకల్లో రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కాసం వెంకటేశ్వర్లు, డా. బూర నర్సయ్య గౌడ్, బండ కార్తీక్ రెడ్డి, సీనియర్ నేతలు పొంగులేటి సుధాకర్ రెడ్డి, చింతల రామచంద్ర రెడ్డి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్ మరియు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి బాటలో కవిత

- కవిత.. గుంట నక్కలు ఎవరు?
- మీకు పార్టీలో ఉన్నప్పుడు అవినీతి కనిపించలేదా?
- 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చిన హామీలపై కవిత మాట్లాడాలి
- సింగరేణి అధ్యక్షురాలుగా ఎవరున్నారు?.. మీరు కాదా?
- మాజీ జడ్పీ చైర్మన్ తులా ఉమ, సుశీలా రెడ్డి, రాజ్యలక్ష్మి



హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజల గుండెల్లో ఉన్నటువంటి పార్టీ. తెలంగాణ రాష్ట్రం ఉద్యమమే లక్ష్యంగా పెట్టుకున్న పార్టీ. బిఆర్ఎస్ పార్టీ లో పదవులు అనుభవించి బయటికి వెళ్లే పోగానే, జాగృతి అనే పేరుతో బిఆర్ఎస్ పార్టీని ఇష్టానుసారంగా తిడుతున్నారు. పార్టీకి నష్టం చేసే విధంగా మాట్లాడుతున్నారు.

మీకు పార్టీలో ఉన్నప్పుడు అవినీతి కనిపించలేదా? అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పేదల కోసం కొట్లాడే పార్టీ బిఆర్ఎస్ పార్టీ. పేదల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాడుతున్నది. అది లగచర్ల కావచ్చురైతులు కావచ్చు, విద్యార్థుల కోసం కావచ్చు . ఇన్ని ఎన్నో రకాలుగా పోరాటం చేస్తున్నది.

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీలో ఉండాలి కానీ పార్టీని వదిలి పోయి తీవ్ర విమర్శలు చేస్తున్నది.

అవినీతిలపై బిఆర్ఎస్ పార్టీ కొట్లాడితే దాని తెల్లవారే కవిత ప్రెస్ మీట్ పెడుతున్నారు. కవిత ఎప్పుడూ కూడా 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చిన హామీలపై వీటిపై కవిత మాట్లాడరు. ఏ ఉద్దేశంతో ఇంత విమర్శలు చేస్తున్నారు. కెసిఆర్‌ని తెలంగాణ బాపు అని సంబో ధిస్తున్నారు. కెసిఆర్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఒక ఉద్యమ నాయకుడిగా ప్రజలు గుండెలో పెట్టుకొని చూసుకుంటున్నారు.

కెసిఆర్‌ని ఒక దోషిగా నిలబెట్టాలని కంకణం కట్టుకొని పనిచేస్తున్నట్టుగా అనిపిస్తుంది. కవిత మాట్లాడుతున్నవి తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. తెలంగాణ ప్రజలు ఆషామాసి వాళ్లు కాదు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో సమైక్య పాలనలో వాళ్లు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన కొట్లాడి పోట్లాడి తెచ్చుకున్నరు తెలంగాణ ప్రజలు.

రేవంత్ రెడ్డి బాటలో కవిత నడుస్తున్నారు. కవిత.. గుంట నక్కలు ఎవరు?

మేము మాట్లాడాలంటే మీకంటే ఎక్కువగా మాట్లాడగలము కానీ మీరు అంటే మాకు ఒక గౌరవం.

కవితక్క అంటే మాకు ఎంతో గౌరవం ఉండేది. ఉద్యమం నుండి చూస్తున్నాము. మీ తో ఎన్నో రోజులుగా పని చేసాము. మీరు ఢిల్లీ లో ఉన్నప్పుడు కూడా మీ దగ్గరకి వచ్చి కలిసాము. మీరు కేసీఆర్ ని మరియు బి ఆర్ ఎస్ పార్టీ ని అనడం సరైనది కాదు.

మీరు మాట్లాడే మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. మీ పద్ధతి సరైనది కాదని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. కవిత ఎప్పుడూ కూడా 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చిన హామీలపై వీటిపై కవిత మాట్లాడాలి. ఇంటి పెద్ద మనుషులను మీరే బయట వేస్తున్నారు. అవినీతి జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ ప్రెస్ మీట్ పెట్టి బయట పెడితే కవిత బిఆర్ఎస్ మీద ప్రెస్ మీట్ పెడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ బురద చల్లడం ఇది సరైనది కాదు.

తీవ్ర విమర్శలు చేస్తుంది ఇది బాధాకరం. సింగరేణి అధ్యక్షురాలుగా ఎవరున్నారు? అప్పుడు మీరు కాదా? ఎవరైనా అధికార పార్టీని విమర్శిస్తారు. ఈమె ప్రతిపక్ష పార్టీని విమర్శిస్తున్నారు.

ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నిలదీయాలి. 420 హామీలు ఇచ్చారు. వాటి మీద చర్చ లేదు.

వీటి మీద పోరాటం చేస్తే మేము చాలా గౌరవిస్తాం.

# శాసనసభ ఆవరణలో ఘనంగా గణతంత్ర వేడుకలు



హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ శాసనసభ ఆవరణలో సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాపతి ప్రసాద్ కుమార్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.





# అమరవీరులకు నివాళులు...

- ప్రగతి పథంలో రాష్ట్రాన్ని నడిపించేందుకు కట్టుబడి ఉన్నాం:
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని యుద్ధ స్మారకం వద్ద రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.

అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ప్రధాన వేడుకల్లో గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, ప్రజాస్వామ్య స్ఫూర్తితో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# స్పీకర్ ధృతరాష్ట్రుని లెక్క మారారు

- కళ్ళకు గంతలు కట్టుకొని నిజాలు చూడలేకపోతున్నారు
- కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే తమ పార్టీలో చేరిన కాలె యాదయ్య పైన చర్యలు తీసుకొని ఎన్నికలకు పోవాలి

హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): తెలంగాణ భవన్‌లో చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి ఆయన అనుచరులతో కలిసి భారత రాష్ట్ర సమితిలో చేరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు

ఈ సందర్భంగా కేటీఆర్ ఏమన్నారంటే.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను కూడా రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నాడు.అనేక అబద్ధాలు, అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పక్కన పెట్టారు, పరిపాలన వదిలేశారు. మేము ఆ రోజే చెప్పాము కాంగ్రెస్ పార్టీ వాళ్లు హామీలు ఇచ్చి మోసం చేస్తారు అని. రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలలో ఏ ఒక్క వర్గాన్ని వదిలిపెట్టకుండా అందరినీ మోసం చేశాడు.

వృద్ధుల నుంచి మొదలుకొని ఆడబిడ్డల వరకు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా అందరినీ రేవంత్ రెడ్డి మోసం చేస్తూనే ఉన్నాడు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న అన్ని వర్గాలు ఈరోజు కాంగ్రెస్ పాలనలో




ఇబ్బందులు పడుతున్నాయి. శాసనసభ స్పీకర్ ధృతరాష్ట్రుని లెక్క మారారు. కళ్ళకు గంతలు కట్టుకొని నిజాలు చూడలేకపోతున్నాడు. చేవెళ్ల యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటే, స్పీకర్ మాత్రం గుర్తించడం లేదు.యాదయ్య ఇంకా భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నాడు అని చెబుతున్నాడు.

కాలె యాదయ్య గెలిపించిన పార్టీని వదిలిపెట్టి పదవుల కోసం, పైసల కోసం కాంగ్రెస్ పార్టీలోకి పోయాడు. యాదయ్య గారు ఏ పార్టీలో ఉన్నాను అంటే, కాంగ్రెస్‌లో ఉన్నానని చెబుతున్నారు. కానీ స్పీకరే ఒప్పుకోవడం లేదు.

కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే తమ పార్టీలో చేరిన కాలె యాదయ్య పైన చర్యలు తీసుకొని ఎన్నికలకు పోవాలి. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అందరినీ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి.

# అక్రిడిటేషన్ల సవరణ జీవోపై టీయూడబ్ల్యూజే హర్షం

**డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు**

**జీవో-103ను స్వాగతించిన యూనియన్ నేతలు**

హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ జీవో-103పై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హర్షం వ్యక్తం చేసింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ? గతంలో జారీ చేసిన జీవో-252పై టీయూడబ్ల్యూజే చేపట్టిన పోరాట ఫలితంగా జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించి, సవరణ జీవో తీసుకురావడం అభినందనీయమన్నారు. డెస్క్ జర్నలిస్టులను కూడా ఇతర జర్నలిస్టుల మాదిరిగానే అక్రిడిటేషన్ కార్డులకు అర్హులుగా ప్రకటించడం ముదావహమని పేర్కొన్నారు.

మండల స్థాయిలో లక్షన్నరకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో అదనపు కార్డులు జారీ చేయడం, కల్చరల్, స్పోర్ట్స్, సినిమా జర్నలిస్టులకు ప్రత్యేక కార్డులు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో మార్పు టీయూడబ్ల్యూజే సాధించిన విజయమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జీవో?239 ప్రకారం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య, తాజా సవరణ జీవో అనంతరం అదే స్థాయిలో కొనసాగడం లేదని తెలిపారు. కార్డుల సంఖ్య భారీగా తగ్గే అవకాశమున్న నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి, జీవో?239 ప్రకారం జారీ అయిన కార్డుల సంఖ్యనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో రాష్ట్రస్థాయిలో కేబుల్ చానల్స్‌కు 12 కార్డులు చొప్పున ఐ అండ్ పీఆర్ ద్వారా జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ అంశాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా, తాజా సవరణ జీవోలో కేబుల్ చానల్స్ ప్రస్తావన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు కార్డుల అంశంలోనూ ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని వ్యాఖ్యానించారు. ఈ విషయాలపై సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌ను వెంటనే కలిసి మరోసారి చర్చిస్తామని, అప్పటికీ స్పందన లేకపోతే భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని టీయూడబ్ల్యూజే నేతలు తెలిపారు.

# వివాదంలో చైనా ఉన్నత సైన్యాధికారి

## అణ్వాయుధ రహస్యాలు లీక్ చేశారన్న ఆరోపణలు

బీజింగ్,జనవరి26(అక్షర గళం): చైనాలో అత్యంత శక్తిమంతమైన సైనికాధికారి ఒకరు అవినీతి, రహస్యాల చేరవేత వివాదంలో ఇరుక్కున్నారు. అవినీతితో పాటు కీలకమైన అణ్వాయుధాల రహస్యాలను అగ్రరాజ్యానికి లీక్ చేశారన్న ఆరోపణలు



రావడంతో ఆయనపై దర్యాప్తు మొదలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వార్త చైనా మిలిటరీలో తీవ్ర చర్చనీయాంశమైంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన జనరల్ జాంగ్ యూక్సియా.. ప్రస్తుతం ఆ దేశ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో అత్యున్నత స్థాయి అధికారి కూడా అయిన ఆయన, ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడంతో తీవ్ర చర్చగా మారింది. ఇటీవల జాంగ్‌పై అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలనాత్మక కథనం ప్రచురించింది. చైనా అణ్వాయుధ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కీలక సాంకేతిక డేటాను జాంగ్ అమెరికాకు లీక్ చేశారన్నది దాని సారాంశం. చైనీస్ మిలిటరీలోని ఉన్నతస్థాయి వర్గాలను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆ కథనం రాసింది. అంతేకాదు.. ప్రమోషన్ల విషయంలో జాంగ్ యూక్సియా పెద్దఎత్తున లంచాలు తీసుకున్నాడని, కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు, ఆయుధ పరికరాల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డాడని ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు ఆ కథనం తెలిపింది. దీంతో చైనా రక్షణ మంత్రిత్వశాఖ ఆయనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు పేర్కొంది. అవినీతి నిర్మూలనకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ చేపట్టిన కఠిన చర్యల్లో భాగంగానే జాంగ్‌పై దర్యాప్తు జరుగుతోందని వాషింగ్టన్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి చెప్పినట్లు ఆ కథనం తెలిపింది. అయితే, దీనిపై చైనా నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటనేదీ రాలేదు. ఇదిలాఉండగా.. ఈ కథనం తర్వాత సామాజిక మాధ్యమాల్లో జాంగ్‌పై మరిన్ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటుకు ప్రయత్నం జరిగిందనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలోనే జాంగ్‌తో పాటు మరికొంతమంది సీనియర్ జనరల్స్‌ను నిర్బంధించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిని చైనా అధికారులు గానీ.. పశ్చిమదేశాల నిఘా సంస్థలు గానీ ధ్రువీకరించలేదు. దీంతో ఇది చర్చగానే సాగుతోంది.

# మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు చిరు సత్కారం

**స్వయంగా ఇంటికి వెళ్లి శాలువ కప్పి సన్మానం**

హైదరాబాద్,జనవరి26(అక్షర గళం): తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ప్రముఖులతో పాటు సీనియర్ నటులు మురళీ మోహన్, రాజేంద్ర





ప్రసాద్‌లు పద్మశ్రీ అవార్డులకు ఎంపిక అయ్యారు. అయితే ఈ ఆనందాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు మెగాస్టార్ చిరంజీవి.

చిరంజీవి స్వయంగా మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌ల నివాసాలకు వెళ్లి వారిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపి తెలుగు సినిమాకు లభించిన ఈ జాతీయ గౌరవం ఒక మైలురాయిగా పేర్కొన్నారు. ఈ ముగ్గురి మధ్య జరిగిన ఆత్మీయ సంభాషణలు, దశాబ్దాల పాటు కలిసి ప్రయాణించిన అనుబంధాన్ని, పరస్పర గౌరవాన్ని ప్రతిబింబించాయి. 2006లో పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందుకున్న చిరంజీవి, ఇది చిత్ర పరిశ్రమకు నిజంగా ఒక ఆనందకరమైన రోజు అని అభివర్ణించారు. ఇదే సందర్భంలో సోషల్ మీడియా ద్వారా కూడా చిరంజీవి పద్మ అవార్డు పొందినవారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మమ్ముట్టీ, మాధవన్‌తో పాటు క్రీడారంగం నుంచి రోహిత్ శర్మ, వరల్డ్‌కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, అలాగే డాక్టర్ దత్తాత్రేయుడు నోరికి అభినందనలు తెలియజేశారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154